క్లుప్తంగా

పేదలను ఆదుకోవడం అభినందనీయం

ఆదిలాబాద్‌టౌన్‌: పేద ప్రజలు పండుగలను ఆనందంగా జరుపుకునేలా స్వచ్ఛంద సంస్థలు ముందుకొచ్చి ఆదుకోవడం అభినందనీయమని మున్సిపల్‌ వైస్‌ చైర్మన్‌ జహీర్‌ రంజాని అన్నారు. రంజాన్‌ మాసంలో ఉపవాస దీక్షలు ఉండే పేదలకు నిత్యావసర సరకులు అందించడం సంతోషంగా ఉందన్నారు. దారుల్‌ అన్సార్‌ వెల్ఫేర్‌ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం సెంట్రల్‌ గార్డెన్‌లో పేదలకు నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హాఫిజ్‌ మంజూర్‌ అహ్మద్‌, సొసైటీ అధ్యక్షుడు ఖాజీ నదీమొద్దీన్‌, ఉపాధ్యక్షుడు హాఫిజ్‌ ఆరీఫ్‌ ఖాన్‌, మోసిన్‌ పటేల్‌, ఖిజర్‌ యాఫై, అతఉల్లా ఖాన్‌ పాల్గొన్నారు.

సర్వీసు రోడ్డుగా మార్చొద్దు



సమావేశమైన గ్రామస్తులు

గుడిహత్నూర్‌: పాత రోడ్డును సర్వీసు రోడ్డుగా మార్చొదని డిమాండ్‌ చేస్తూ గ్రామస్తులు పంచాయతీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. కాంట్రాక్టర్‌ నాగరాజ్‌తో చర్చలు జరిపారు. అయితే సర్వీసు రోడ్డుగా మార్చడం వల్ల సమస్యలు ఎదురవుతాయని ప్లాన్‌ మార్చుకోవాలని కోరారు. ఈ ప్రతిపాదనను ఉన్నతాధికారులకు నివేదిస్తామని ఆయన తెలిపారు. సమావేశంలో సర్పంచ్‌ జాదవ్‌ సునీతా రమేష్‌, జెడ్పీటీసీ పతంగే బ్రహ్మానంద్‌, ఎంపీటీసీ అంకతి సవితారవీందర్‌, సంజీవ్‌ ముండే, జమీర్‌, మాదవ్‌ కేంద్రే, వామన్‌ గిత్తే, నాగ్‌నాథ్‌ అప్పా, లక్ష్మణ్‌ కేంద్రే, రావణ్‌ ముండే, వినోద్‌ కొల్లూరి, కరుణాకర్‌ పాల్గొన్నారు.

ఉట్నూర్‌ కాంగ్రెస్‌ ఇన్‌చార్జి అధ్యక్షుడిగా రాజేశ్వర్‌

ఆదిలాబాద్‌టౌన్‌: ఉట్నూర్‌ మండల కాంగ్రెస్‌ కమిటీ ఇన్‌చార్జి అధ్యక్షుడిగా దూట రాజేశ్వర్‌ నియమితులయ్యారు. డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ ఖాన్‌ ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో ఆదివారం జిల్లా కాంగ్రెస్‌ కమిటీ కార్యనిర్వాహక అధ్యక్షుడు భూపెల్లి శ్రీధర్‌ రాజేశ్వర్‌కు నియామక పత్రం అందజేశారు. పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భాగస్వాములు కావాలి

నార్నూర్‌: మండల కేంద్రంలోని వేంకటేశ్వర ఆలయ అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలని ఆలయ కమిటీ అధ్యక్షుడు రాథోడ్‌ విఠల్‌ అన్నారు. ఆదివారం విజయ్‌నగర్‌ కాలనీలోని సేవాలాల్‌ మహరాజ్‌ కమ్యూనిటీ హాల్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మే 12న విగ్రహ ప్రతిష్ఠాపన, మే 10 నుంచి 12 వరకు పూజ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. దివ్యశ్రీ ఫౌండేషన్‌ చైర్మన్‌ ధారావత్‌ ప్రవీణ్‌నాయక్‌ రూ. 50 వేలు విరాళం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌ బానోత్‌ గజానంద్‌నాయక్‌, పీఏసీఎస్‌ చైర్మన్‌ అడే సురేశ్‌, ఉప సర్పంచ్‌ మహేందర్‌, కాంతరావు దుర్గే, ధర్మేందర్‌ అడే పాల్గొన్నారు.


ప్రెస్‌క్లబ్‌ కార్యవర్గం ఎన్నిక

గుడిహత్నూర్‌: మండల ప్రెస్‌క్లబ్‌ కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గన్నోజి శ్రీనివాస్‌, ప్రధాన కార్యదర్శిగా కొండా ప్రశాంత్‌, కోశాధికారిగా రంగు అశోక్‌ గౌడ్‌, గౌరవ అధ్యక్షుడిగా బండారి రవీందర్‌, ఉపాధ్యక్షుడిగా ముండే మురళీధర్‌, తదితరులను ఎన్నుకున్నారు. సమావేశంలో సీనియర్‌ పాత్రికేయులు చట్ల దశరథ్‌ రెడ్డి, శ్రీనివాస్‌ పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

నార్నూర్‌: మండల కేంద్రంలో సోమవారం నిర్వహించే బీఆర్‌ఎస్‌ ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని ఎంపీటీసీ సభ్యుడు కిరణ్‌, సర్పంచ్‌ చంద్రహరీ కోరారు. ఆదివారం గాదిగూడ మండలంలోని ఖాండోవ్‌, కట్టగూడ, సెడ్వాయి, బోడ్డిగూడ, అల్లుగూడ, చిత్తగూడ గ్రామాల్లోని కార్యకర్తతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే ఆత్రం సక్కు, జెడ్పీ చైర్మన్‌ రాథోడ్‌ జనార్దన్‌ హాజరుకానున్నట్లు తెలిపారు.

కాలనీ అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న విలాస్‌రెడ్డి

కైలాస్‌నగర్‌: తమపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తు కాలనీ అభివృద్ధికి కృషి చేస్తామని ఎంప్లాయిస్‌ కాలనీ అధ్యక్షుడు విలాస్‌ రెడ్డి అన్నారు. ఆదివారం కార్యవర్గాన్ని ప్రకటించారు. గౌరవ అధ్యక్షుడిగా కరణ్‌సింగ్‌, వై.లింగారెడ్డి, అధ్యక్షుడిగా విలాస్‌ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా దౌలత్‌, బాబులాల్‌, ప్రధాన కార్యదర్శిగా రామకృష్ణరెడ్డి, జాయింట్‌ సెక్రటరీలు వినోద్‌, అజ్‌గర్‌, కోశాధికారి లక్ష్మారెడ్డి, కల్చరల్‌ ఆర్గనైజర్లుగా సంతోశ్‌, శ్రీరాం, ప్రచార కార్యదర్శిగా తుమ్మల గంగన్న, విఠల్‌, అప్పారావులను ఎన్నుకున్నారు.

ప్లాట్లుగా మారుతున్న రోడ్లు

- బస్టాండ్‌ స్థలంలోకి రోడ్డు మళ్లింపు
- కొత్త లే అవుట్‌ సృష్టించి అమ్మకాలు
- చేతులు మారిన కోటి రూపాయలు
- అధికార పార్టీ నాయకుల జిమ్మిక్కు



ఆర్టీసీ స్థలంలో వేసిన రోడ్డు



బేలలో సర్వే నంబరు 42లో ప్లాట్లుగా మారిన 20 ఫీట్ల రోడ్డు

బేల: ప్లాట్ల ధరలు అమాంతంగా పెరగడంతో రోడ్లు కనిపిస్తే చాలు.. భూబకాసురులు ప్లాట్లు చేసి అమ్మేస్తున్నారు. దీనికి నిదర్శనం.. బేలలో ఆర్టీసీ బస్టాండ్‌కు అనుసంధానంగా ఉన్న లేఅవుట్‌లోని 20ఫీట్ల రోడ్డును ప్లాట్లు చేసి, కొత్త లేఅవుట్‌ సృష్టించారు. ఆర్టీసీ బస్టాండ్‌ స్థలంలోకి ఆ రోడ్డును మళ్లించారు. ఈతతంగం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇందులో అధికార పార్టీకి చెందిన నాయకుల హస్తం ఉందని ప్రజలు చర్చించుకుంటున్నారు. రోడ్డు ప్లాట్లుగా మారిన అక్రమ దందాలో కోటి రూపాయల వరకు చేతులు మారినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ దందాపై మండల యువజన సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో మండల పంచాయతీ అధికారి సుమీర్‌ హైమద్‌కు ఫిర్యాదు చేశారు.

కొత్త లే అవుట్‌ సృష్టించారు..

మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌కు 1.05 ఎకరా ఉంది. ఆర్టీసీ అధికారులు నిర్లక్ష్యంతో ఇప్పటిదాకా ఎటువంటి హద్దులు గుర్తించలేదు. ఇదే అదనుగా భావించిన అక్రమార్కులు సర్వే నంబరు 42లో 20 ఫీట్ల రోడ్డును ప్లాట్లు చేసి, (100 ఫీట్ల పొడవు, 20 ఫీట్ల వెడల్పు గల) రోడ్డును ఆర్టీసీ బస్టాండ్‌ స్థలంలోకి మళ్లించారు. దీని కోసం కొత్త లేఅవుట్‌ను సృష్టించారు. ఈ బస్టాండ్‌కు అనుసంధానంగా 20 ఫీట్ల రోడ్డు పాత లే అవుట్‌లో (1988 సంవత్సరంలో సర్వే నంబరు 42, ఐదెకరాల లే అవుట్‌లో) ఉంది. ఆ లే అవుట్‌లోని రోడ్డు, స్థానిక అంబేద్కర్‌ చౌరస్తా నుంచి బస్టాండ్‌ వైపుకు వచ్చే ప్రధాన రోడ్డుకు కలుస్తుంది. ఇటీవల ఓ ప్లాటు యాజమాని తన భవన నిర్మాణాన్ని పూర్తి చేసి, భవిష్యత్‌లో ఆర్టీసీ బస్టాండ్‌ ప్రహరీ నిర్మిస్తే ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉన్నందున ప్లాటు ఎదుట రోడ్డు చూయించాలని లే అవుట్‌ యజమానికి కోరాడు. దీంతో ఆ యజమాని రోడ్డును, ఆర్టీసీ బస్టాండ్‌ స్థలంలోకి దారి మళ్లించి చూయించాడు. ఇదేంటనీ ప్రశించగా.. బుకాయించాడు. ప్లాట్‌ యజమాని చేసేదేమి లేక ఈనెల 22న పంచాయతీ కార్యదర్శికి, ఎంపీడీవో కార్యాలయంలో రోడ్డు తీయించాలని విన్నవించాడు. కాగా ఈ సమస్య పరిష్కారం కాకపోగా.. అధికార పార్టీ నాయకులు 20 ఫీట్ల రోడ్డును ప్లాట్లు మార్చి సృష్టించిన కొత్త లేఅవుట్‌ బయటకు వచ్చింది. లేఅవుట్‌ 2000 సంవత్సరంలో రివైజ్‌డ్‌ చేసినట్లు రూపొందించారు.

రివైజ్‌డ్‌ లేఅవుట్‌ ఉందంటున్నారు



ప్లాట్‌ యజమాని ఇచ్చిన 1988 సంవత్సరం లేఅవుట్‌లో 20 ఫీట్ల రోడ్డు నిదానంగా ఆర్టీసీ బస్టాండ్‌కు అనుసంధానంగా ఉంది. ప్లాట్‌ యజమాని దరఖాస్తు విషయమై, వివరణ ఇవ్వాలని లేఅవుట్‌ యజమానికి తెలియజేసినాం.. రివైజ్‌డ్‌ లేఅవుట్‌ ఉందంటున్నాడు. ఈవిషయమై ఉన్నతాధికారులకు నివేదిస్తాను.

– సురేష్‌, పంచాయతీ కార్యదర్శి, బేల

పార్టీలకతీతంగా వార్డుల అభివృద్ధి

- ఆదిలాబాద్‌ ఎమ్మెల్యే జోగు రామన్న

కైలాస్‌నగర్‌: పార్టీకతీతంగా వార్డులను అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. ఆదివారం పట్టణంలోని కోజా కాలనీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కాంగ్రెస్‌ నాయకుడు రత్నకిషోర్‌ రెడ్డి, కాలనీవాసులు బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తమ వార్డులను సైతం అభివృద్ధి చేసేందుకు నాయకులు కాంగ్రెస్‌ రాజీనామా చేసి బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని తెలిపారు. త్వరలోనే మౌలిక వసతుల కల్పనకు అధికారులతో సర్వే నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్‌ అడ్డి భోజారెడ్డి, బీఆర్‌ఎస్‌ పట్టణ అధ్యక్షుడు అజయ్‌, కౌన్సిలర్లు భరత్‌, పవన్‌, ప్రకాష్‌, లక్ష్మణ్‌ పాల్గొన్నారు.



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే

రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలి

ఆదిలాబాద్‌టౌన్‌: అత్యవసరం సమయంలో రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని ఆదిలాబాద్‌ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. రిమ్స్‌లోని ఆడిటోరియంలో ఆదివారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రక్తదానం చేసిన దాతలకు పండ్ల రసం అందించి అభినందించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సరైన సమయంలో రక్తం అందక అనేకమంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయా సంఘాలు, యువత ముందుకొచ్చి రక్తదానం చేయాలని కోరారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్‌ అడ్డి భోజారెడ్డి, రిమ్స్‌ డైరెక్టర్‌ జైసింగ్‌ రాథోడ్‌, తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ సమావేశానికి వెళ్లిన నాయకులు

బోథ్‌: మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన సీపీఐ సమావేశానికి బోథ్‌ నాయకులు తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో గోవర్దన్‌, గోదావరి, దాసు, సుమేర్‌ పాషా, నరేష్‌, భోజారెడ్డి, భోజన్న పాల్గొన్నారు.

ఎదులాపురం: మంచిర్యాలలో సీపీఐ ఉమ్మడి జిల్లా సమావేశానికి సీపీఐ జిల్లా నాయకులు తరలివెళ్లారు. ఆదివారం ఉదయం దాదాపు 200 మంది వరకు నాయకులు వాహనాల్లో వెళ్లారు. జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌ రెడ్డి, రాష్ట్ర సమితి సభ్యురాలు ముడుపు నలినిరెడ్డి, అరుణ్‌ కుమార్‌, బోథ్‌ నియోజకవర్గ కార్యదర్శి మాచర్ల శ్రీనివాస్‌ యాదవ్‌, కుంటాల రాములు, తదితరులు పాల్గొన్నారు.



తరలివెళ్తున్న సీపీఐ నాయకులు

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

ఆదిలాబాద్‌టౌన్‌: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చని సూపర్‌వైజర్‌ గౌరీరాణి అన్నారు. పోషణ పక్షోత్సవాల్లో భాగంగా ఆదివారం ఆదిలాబాద్‌ పట్టణంలోని భుక్తాపూర్‌ సర్కిల్‌లోని వరలక్ష్మినగర్‌ అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహారం, చిరుధాన్యాలపై అవగాహన కల్పించారు. చిన్నారులకు తప్పనిసరిగా పౌష్టికాహారం అందించాలన్నారు. పోషకాహారం తీసుకోవడంతో రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. అర్హులైన ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీలు జ్యోతి, ఎ.కవిత, ఆయా లత, విమల, జ్యోతి, పూజ, నాయెరా, రుక్సార్‌, రేష్మా, హీన, లక్ష్మి పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్‌ గౌరీరాణి

భవనం ప్రారంభించేదెప్పుడో?



తాంసి: భీంపూర్‌ మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన మండల విద్యా వనరుల కేంద్రం భవనం ప్రారంభానికి నోచుకోవడం లేదు. గత నాలుగు సంవత్సరాల క్రితం ప్రభుత్వం భవన నిర్మాణానికి రూ.30 లక్షల నిధులు విడుదల చేసింది. భవన నిర్మాణం పూర్తయి మూడు నెలలు గడుస్తున్నా.. ఇంకా అధికారులు ప్రారంభించలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి భవనాన్ని ప్రారంభించాలని ప్రజలు కోరుతున్నారు.

నేడు శనగ కొనుగోళ్లు బంద్‌

జైనథ్‌: మండల కేంద్రంలోని మార్కెట్‌ యార్డ్‌లో శనగ కొనుగోళ్లను సోమవారం నిలిపివేస్తున్నట్లు జైనథ్‌ ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్రం సీఈవో గంగన్న తెలిపారు. వాతావరణంలో మార్పులు, వర్షం కారణంగా కొనుగోలు తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. రైతులు గమనించి సహకరించాలని కోరారు.

నేడు సహకార సంఘం సర్వసభ్య సమావేశం

తాంసి: మండల కేంద్రంలోని సహకార సంఘం కార్యాలయంలో నేడు సహకార సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు సొసైటీ సీఈవో కేశవ్‌ తెలిపారు. ఉదయం 12 గంటలకు నిర్వహించే సమావేశానికి డీసీసీబీ చైర్మన్‌ అడ్డి భోజారెడ్డి హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. తాంసి, భీంపూర్‌ మండలాలకు చెందిన సహకార సంఘం డైరెక్టర్‌లు సకాలంలో హాజరు కావాలని కోరారు.

ఆర్థిక సాయం

బోథ్‌: మండలంలోని సొనాల గ్రామానికి చెందిన ట్రాక్టర్‌ డ్రైవర్‌ కర్తార్‌ సింగ్‌ ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. కాగా బోథ్‌ ఎంపీపీ తుల శ్రీనివాస్‌ బాధిత కుటుంబాన్ని ఆదివారం పరామర్శించారు. రూ. 10 వేల నగదు అందజేశారు. ఆయన వెంట ఇర్ల అఖిల్‌, ఉప్పు ఉదయ్‌, భూషణ్‌, భూమన్న ఉన్నారు.

స్నేహితురాలికి చేయూత



నగదు అందజేస్తున్న పూర్వవిద్యార్థులు

బేల: మండల కేంద్రంలోని ఇందిరానగర్‌ కాలనీకి చెందిన తోటి స్నేహితురాలు ప్రమీల భర్త అరవింద్‌ అనారోగ్యంతో మృతి చెందాడు. ఆదివారం ఆమె కుటుంబానికి జెడ్పీఎస్‌ఎస్‌ 1998– 99బ్యాచ్‌ పదో తరగతి విద్యార్థులు (సాంగిడి గ్రామం) ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో ప్రవీణ్‌, విజయ్‌, శ్రీనివాస్‌, గణేష్‌, అమోల్‌, ప్రమోద్‌, దేవన్న, సంతోష్‌, తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

కైలాస్‌నగర్‌: సంగెం ట్రస్ట్‌ ఆధ్వర్యంలో పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌ వద్ద అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ట్రస్ట్‌ చైర్మన్‌ సంగెం సుధీర్‌కుమార్‌, సభ్యులు మహేందర్‌ రెడ్డి, సలీమ్‌, సుభాష్‌, పవన్‌, కృష్ణ, నరేష్‌, లకన్‌ పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి



మాట్లాడుతున్న సాకటి దశరథ్‌

తాంసి: బీజేపీని బూత్‌స్థాయి నుంచి బలోపేతానికి చేయాలని బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి సాకటి దశరథ్‌ అన్నారు. ఆదివారం మండలంలోని తాంసి, బండల్‌నాగాపూర్‌, సావర్గాం గోట్కూరి గ్రామాల్లో పర్యటించారు. స్వశక్తి కరణ్‌ అభియాన్‌లో భాగంగా బూత్‌స్థాయిలో పార్టీ బలోపేతానికి పన్నా ప్రముఖ్‌లను ఏర్పాటు చేశారు. ఎన్నికలు దగ్గర పడుతున్నందున నాయకులు, కార్యకర్తలు చురుగ్గా పని చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు సామ సంతోష్‌ రెడ్డి, మండల అధ్యక్షుడు ప్రవీణ్‌, ప్రధాన కార్యదర్శి సుభాష్‌, రాజు, సురేశ్‌ పాల్గొన్నారు.

అటెన్షన్‌ ప్లీజ్‌.. ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్‌



తలమడుగు: మండలంలోని కజ్జర్ల గ్రామానికి వెళ్లే రోడ్డు సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్‌ ప్రమాదకరంగా ఉంది. చుట్టూ కంచె లేకపోవడంతో స్థానిక ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కంచె ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

– సంబంధిత అధికారి: సతీశ్‌, ఏఈ విద్యుత్‌శాఖ, ఫోన్‌: 90145 24827

ముగిసిన విశ్వశాంతి మహాయాగం

ఆదిలాబాద్‌రూరల్‌: లోక కల్యాణార్థం ఈనెల 24 నుంచి మావల మండలంలోని దుర్గానగర్‌లోని దుర్గామాతా ఆలయంలో చేపట్టిన శ్రీరుద్రసహిత శతచండీ విశ్వశాంతి మహాయాగం ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజ నిర్వహించారు. ఎమ్మెల్యే జోగు రామన్న యజ్ఞంలో పాల్గొన్నారు. ఐదు రోజు పాటు యాగం, యజ్ఞం వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య పూజరి కిషన్‌ మహారాజ్‌ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు.



పాల్గొన్న ఎమ్మెల్యే జోగు రామన్న

త్రిశూలం ప్రతిష్ఠాపన

ఆదిలాబాద్‌రూరల్‌: మండలంలోని దిమ్మ గ్రామంలోని పోచ్చమ్మ ఆలయంలో ఆదివారం ఆలయ పూజరి చిన్న దేవన్న ఆధ్వర్యంలో త్రిశూలంను ప్రతిష్ఠించారు. అంతకు ముందు పొచ్చర గ్రామం నుంచి ర్యాలీగా వెళ్లి దిమ్మ గ్రామానికి చేరుకున్నారు. పోచ్చమ్మ ఆలయం ఎదుట కొన్నేళ్ల కిందటి వేపచెట్టు ఎండిపోవడం జరిగిందన్నారు. ఆచెట్టు నుంచి త్రిశూలం తయారు చేసి ఆలయంలో ప్రతిష్ఠించడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో దిమ్మ, పొచ్చర గ్రామస్తులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఆదరించండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాథోడ్‌ బాపురావు

- బోథ్‌ ఎమ్మెల్యే రాథోడ్‌ బాపురావు

తలమడుగు: బీఆర్‌ఎస్‌ చేసిన అభివృద్ధిని చూసి పార్టీని మళ్లీ ఆదరించాలని బోథ్‌ ఎమ్మెల్యే రాథోడ్‌ బాపురావు అన్నారు. ఆదివారం మండలంలోని సుంకిడి గ్రామంలో బీఆర్‌ఎస్‌ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రం, జిల్లా బీఆర్‌ఎస్‌ హయాంలోనే అభివృద్ధి చెందిందన్నారు. ప్రతీగ్రామానికి బీటీ, సీసీరోడ్లు వేశామన్నారు. రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. గుట్ట ప్రాంతాల్లోని గ్రామాలు అభివృద్ధి చెందాయన్నారు. బీఆర్‌ఎస్‌ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్‌ తోట వెంకటేశ్‌, బోథ్‌ అధికార ప్రతినిధి మొట్టే కిరణ్‌ కుమార్‌, పీఏసీఎస్‌ చైర్మన్‌ శ్రీనివాస్‌ రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు మగ్గిడి ప్రకాష్‌, కాటిపెల్లి శ్రీనివాస్‌రెడ్డి, ప్రమోద్‌, శెవ్వ పోచ్చన్న పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన రెడ్డి సంఘం నాయకులు

తలమడుగు: మండల రెడ్డి సంఘం నాయకులు ఆదివారం బోథ్‌ ఎమ్మెల్యే రాథోడ్‌ బాపురావును కలిసి సన్మానించారు. రెడ్డి భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్షుడు అల్లూరి స్వామి రెడ్డి, కార్యదర్శి అయిండ్ల వెంకట్‌ రెడ్డి, రావుల నిఖిల్‌ రెడ్డి, కటిపెళ్లి శ్రీనివాస్‌రెడ్డి, కేశవ్‌రెడ్డి, మధుకర్‌ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం

ఆదిలాబాద్‌: బీజేపీ అధికారంలోకి వస్తేనే అభివృద్ధి సాధ్యమని బీజేపీ నాయకుడు కంది శ్రీనివాస్‌ రెడ్డి అన్నారు. ఆదివారం ఆదిలాబాద్‌ జిల్లా కేంద్రంలోని బాలాజీ నగర్‌ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పలు కాలనీల్లో మౌలిక వసతుల లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే సమస్యల పరిష్కారంలో విఫమయ్యారని విమర్శించారు. నాయకులు సంతోష్‌ సింగ్‌ ఠాకూర్‌, రాజకుమార్‌, ఆకాష్‌, ఋషి, దేవిదాస్‌, నవీన్‌ పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక మార్గంలో పయనించాలి

బేల: ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక మార్గంలో పయనించాలని బీజేపీ నాయకుడు కంది శ్రీనివాస్‌ రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని అవాల్‌పూర్‌ గ్రామంలోని ఆధ్యాత్మిక గురువు పూలాజీబాబా ధ్యానమందిరం వార్షికోత్సవంలో పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి

ఆదిలాబాద్‌రూరల్‌: గుడిసెలు వేసుకోని నివాసం ఉంటున్న ఆదివాసీలకు మౌలిక వసతులు కల్పించాలని బీజేపీ రాష్ట్ర నాయకులు కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. మావల మండంలోని బట్టిసావర్‌గాం శివారు ప్రాంతాంలో గల సర్వేనంబర్‌ 72లో గుడిసెలు వేసుకోని నివాసం ఉంటున్న వారికి ఇంటి స్థలాల పట్టాలు, మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్‌ చేస్తూ ఆదివాసీలు నిరాహార దీక్ష చేపడుతున్నారు. ఆదివారం దీక్ష శిబిరాన్ని సందర్శించి వారికి సంఘీభావం తెలిపారు. ఆదివాసీలకు వెంటనే ఇంటి స్థలాల ఇవ్వాలని డిమాండ్‌ చేశారు. ఆదివాసీల కోసం రాష్ట్ర ప్రభుత్వం చేసిందేమీ లేదని విమర్శించారు. ఆయన వెంట బీజేపీ నాయకులు ఉన్నారు.



కాలనీవాసులతో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయండి

నార్నూర్‌: మండల కేంద్రంలో సోమవారం నిర్వహించే బీఆర్‌ఎస్‌ ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని ఎంపీటీసీ సభ్యుడు కిరణ్‌, సర్పంచ్‌ చంద్రహరీ కోరారు. ఆదివారం గాదిగూడ మండలంలోని ఖాండోవ్‌, కట్టగూడ, సెడ్వాయి, బోడ్డిగూడ, అల్లుగూడ, చిత్తగూడ గ్రామాల్లోని కార్యకర్తతో సమావేశం నిర్వహించారు. పార్టీ బలోపేతం, సంక్షేమ పథకాలు, ఎన్నికల వ్యూహాలపై చర్చిస్తామన్నారు. ఎమ్మెల్యే ఆత్రం సక్కు, జెడ్పీ చైర్మన్‌ రాథోడ్‌ జనార్దన్‌ హాజరుకానున్నట్లు తెలిపారు.